విశాలాంధ్ర

అట్టహాసంగా ప్రారంభమైన జాతీయ స్థాయి నాటిక పోటీలు

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం సిఆర్‌సి కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి ఉగాది తెలుగు నాటిక పోటీలు బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక సిఆర్‌సి ప్రాంగణంలోని వేదికపై సిఆర్‌సి అధ్యక్షుడు తాడి నాగమోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. మల్లాది గోపాలకృష్ణకు తల్లావఝుల సుందరం స్మారక పురస్కారాన్ని ప్రముఖ సినీ నటుడు, సిఆర్‌సి కాటన్ కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు తనికెళ్ల భరణి చేతుల మీదుగా అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 23 సంవత్సరాలుగా పోటీలు నిర్వహిస్తూ నాటక రంగానికి సిఆర్‌సి అందిస్తున్న ప్రోత్సాహం అభినంద నీయం అన్నారు. ఈ ఏడాది పోటీల్లో దేశంలో ఎక్కడా లేని విధంగా ఉత్తమ ప్రదర్శనలకు రూ.3 లక్షలు, రూ.2 లక్షలు, రూ.లక్ష చొప్పున ప్రైజ్ మనీగా ఇవ్వడం సాధారణ విషయం కాదని, నాటక రంగ అభివృద్ధికి సిఆర్‌సి సంస్థ చేస్తున్న కృషికి ఇది నిదర్శనమని జగ్గిరెడ్డి అన్నారు. అనంతరం మొదటిగా తెనాలికి చెందిన కళలకాణాచి వారి అంధస్వరం, పొన్నూరుకు చెందిన రసఝరి వారి కాపలా నాటికలు ప్రదర్శించారు. తొలుత ఉగాది సందర్భంగా గోపాలపురంకు చెందిన శివకోటి శంకరశర్మ శోభకృత్ నామ సంవత్సర పంచాంగ శ్రవణం చేసారు విశాఖపట్నంకు చెందిన కృష్ణ యజుర్వేద పండితుడు మావళ్ళపల్లి మాధవశర్మకు సిఆర్‌సి కార్యవర్గ సభ్యులు వేద పండిత సత్కారం చేసారు. చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీ నటులు గౌతంరాజు, కోట శంకరరావు, మురళీధర్ గౌడ్, సిఆర్‌సి కార్యదర్శి కర్రి అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చిన్నం తేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలకు దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర - కరప : మండలంలో వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని తాళ్లరేవు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి వి. మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయు అభ్యర్థులు మార్చి 31వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. అంగన్వాడి కార్యకర్తకు పెద్దకొత్తూరు-ఓసి(హెచ్‌హెచ్) ఖాళీగా ఉన్న ఈ పోస్ట్ దరఖాస్తు చేసుకోవాలని అంగన్వాడి సహాయకులకు కరప గ్రామంలో-7వ కేంద్రంలో (బీసీఏ), 8వ కేంద్రంలో (బీసీ-సీ),కూరాడ గ్రామంలో-1వ కేంద్రంలో (బీసీ ఇ), పెద్దాపురప్పాడు -1వ కేంద్రంలో ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలికి ఖాళీలు ఏర్పడ్డాయని, వీటికి దరఖాస్తు చేసుకున్న వారు స్థానికంగా నివాసం ఉండాలని స్థానిక మహిళ వివాహిత అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం ఆయా గ్రామ పరిధిలో గ్రామ కార్యదర్శిని సంప్రదించి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

తహసీల్దారుకు వినతి పత్రం అందజేత

విశాలాంధ్ర - ముమ్మిడివరం : తొండంగి మండలం శృంగవృక్షం గ్రామంలో మార్చి 21వ తేదీన రాత్రి దళిత గ్రామం పై దాడి చేసి దళిత యువకుడు నడిపెల్లి రాముని అత్యంత కిరాతకంగా హత్య చేశారని, ఈ హత్యకు కారకులైన అగ్రకులాల పెత్తందారులను తక్షణం ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ యాక్ట్ కేసు పెట్టి అరెస్టు చేయాలని కోరుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ప్రారంభమైన నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం గౌరీపట్నం నిర్మలగిరి మేరీ మాత మహోత్సవాలు మతసామర స్యానికి ప్రతీకగా నిలిచాయి. ప్రతి సంవత్సరం ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం భక్తులు మేరీమాతను సందర్శించుకుని కొబ్బరి కాయలు, అరటిపళ్ళు సమర్పించుకొన్నారు. కొంతమంది భక్తులు తలనీలాలు సమర్పించారు. గురువారంనాడు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం దివ్య బలి పూజలు జరిగాయి. నిర్మలగిరి క్షేత్రం డైరెక్టర్ ఎస్ జాన్ పీటర్ మేరీమాతకు ప్రత్యేక పూజలు చేసి భక్తులను ఆశీర్వదించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు మేరీమాత ఆలయం వద్ద చెట్లకు ముడుపులు కట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. గురువారం వాటికన్ సిటీ రాయబారి లియో ఫోల్డ్ జరెల్లి ఏలూరు పీఠాధిపతి జయరావు పొలిమేర సమిష్టి దివ్యబలి పూజలు నిర్వహించారు.

వృద్ధాశ్రమానికి వంటసామగ్రి అందజేత

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లిలో గల జై కిసాన్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి దేవరపల్లి మానవతా సంస్థ వంటసామగ్రి మిక్సీ గ్రైండర్లు అందజేసింది. దేవరపల్లి మానవతా సంస్థ చైర్మన్ బలుసు సత్యనారాయణ అధ్యక్షుడు పప్పు వెంకట రామారావు వృద్ధాశ్రమ నిర్వాహకుడు దెయ్యాల భీమరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా బలుసు సత్యనారాయణ, పప్పు వెంకట రామారావు మాట్లాడుతూ వృద్ధులను ఆదుకోవటానికి తమ సంస్థ ఎప్పుడు ముందుంటుందని అన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు దెయ్యాల భీమరాజు దేవరపల్లి మానవతా సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ సభ్యులు ఈదుపుగంటి నాగేశ్వరరావు, ఆచంట సుభాష్ చంద్రబోస్, ఆచంట రాంబాబు, వెలమాటి సత్యనారాయణ బండి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధి పథంలో ఏపీ

విశాలాంధ్ర - అనపర్తి : సంక్షేమ పథకాలతో పాటు అనేక అభివృద్ధి పథకాలు చేపట్టి సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. స్థానిక ఐ ఎల్ టి డి బాబా నగర్, ధరణికోట ప్రాంతంలో రూ.9.30, రూ.22.16 లక్షల వ్యయంతో నిర్మాణం చేసిన సిసి రోడ్, డ్రైనేజీ ఎమ్మెల్యే సత్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల అధ్యక్షులు సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), జెడ్పీటీసీ సత్తి గీతా వరలక్ష్మి వెంకటరెడ్డి, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు సత్తి శ్రీనివాసరెడ్డి (ఎస్ఎస్) పార్టీ పట్టణ అధ్యక్షులు నల్లమిల్లి మురళి, ఎంఎంసి చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణగూడెంలో విషాదం

విశాలాంధ్ర - చాగల్లు : గ్రామానికి చెందిన ప్రముఖ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పంచాయతీ కార్యవర్గ సభ్యులు, విద్యా కమిటీ చైర్మన్, ఆర్ ఎం పి కోలాటి కాంతారావు తనయుడు కోలాటి అభిలాష్ (25) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గురువారం తెల్లవారుజామున రాజమహేంద్రవరం నుండి తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదుపుతప్పి పడిపోవడంతో తల డివైడర్‌కు తగిలి సంఘటన స్థలం లోనే మృతి చెందారు. ప్రేమ వివాహం చేసుకున్న ఆయన భార్య ప్రస్తుతం గర్భవతి.గతంలో వీరికి ఒక బాబు ఉన్నారు. ప్రమాద వార్త తెలుసుకున్న గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగపు కార్యదర్శి,ఊనగట్ల సహకార పరపతి సంఘం అధ్యక్షులు ఆతుకూరి దొరయ్య,రాష్ట్ర కలింగ కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నాడ సింహాద్రి,జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యురాలు గారపాటి విజయదుర్గ,కొవ్వూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఉండవెల్లి శ్రీనివాసరావు,గ్రామ సర్పంచ్ గురువెల్లి కుమారి,అభిలాష్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

యువతకు ఆదర్శం భగత్‌సింగ్

విశాలాంధ్ర -రాజమహేంద్రవరం: భారతదేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను పూర్తిగా తీసుకొని యువత ముందుకెళ్లాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. సర్దార్ భగత్ సింగ్ 92 వ వర్ధంతి సందర్భంగా సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద జట్లులేబర్ యూనియన్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధు మాట్లాడుతూ సర్దార్ భగత్ సింగ్ 1907 సెప్టెంబర్ 28 న లాహోర్ సమీపంలోని బంగా అనే గ్రామంలో కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు జన్మించారని, జాతీయ భావాలు, పోరాట సాంప్రదాయం కలిగిన కుటుంబం సర్దార్ భగత్ సింగ్‌ది అన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి , నగర కార్యదర్శి కుండ్రపు రాంబాబు, వి. కొండలరావు మాట్లాడుతూ తెల్లదొరలు పోయి నల్ల దొరలు వస్తే ఆ స్వాతంత్ర్యం వట్టి బూటకం అని అప్పుడే భగత్‌సింగ్ అన్నారని, భగత్ సింగ్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్క విద్యార్థి,యువత పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎం ఎస్ రాజు, జట్లసంఘం కార్యదర్శి సప్ప రమణ, పెంటు దేముడు, వెంకటరావు, కాళ్ళ అప్పల నాయుడు, నల్ల రామారావు, అప్పారావు జిల్లా అధ్యక్షుడు చింతలపూడి సునీల్, పార్టీ సీనియర్ నాయకులూ సీపీని రమణమ్మ , యడ్ల లక్ష్మి, బద్రరావు, కె. రామకృష్ణ, జి ఏ రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో : భగత్ సింగ్ 92వ వర్ధంతి స్థానిక రామకృష్ణారావుపేట భగత్ సింగ్ విగ్రహానికి సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కె. బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం 23 సంవత్సరాల వయసులో భగత్ సింగ్ ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారని, చివరకు ఉరికంబాన్ని సైతం ఎక్కారని అన్నారు. యువత భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పి.సుబ్బలక్ష్మి, సాయమ్మ ఎల్లయ్యమ్మ, శ్యామలలు పాల్గొన్నారు.

కాకినాడ, రామచంద్రపురంలో : ప్రజానాట్య మండలి, అబ్దుల్ కలాం సేవాదళ్ ఆధ్వర్యంలో స్థానిక రైస్‌పేట గల అంకుల్ సైకిల్ షాప్ దగ్గర స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా సర్దార్ భగత్ సింగ్ చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రామచంద్రపురం శాఖ అధ్యక్షులు గొర్రెల రాము పూలమాలవేసి నివాళి అర్పిం చారు. ఆయన మాట్లాడుతూ 92 సంవత్సరాల తర్వాత కూడా సర్దార్ భగత్ సింగ్‌ని తలుచుకుంటున్నాము అంటే స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన నిర్వహించిన పాత్ర ఎటువంటిదో మనందరం తెలుసుకోవాలని అన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు కలకత్తాలో గల బ్రిటిష్ పరిపాలనా భవనంలోకి బాంబును విసిరి సంచలనం సృష్టించారని, ఈ కేసులో పై ముగ్గురిని బ్రిటిష్ ప్రభుత్వం నిందితులుగా గుర్తించి ఉరిశిక్ష విధించారని తెలిపారు. నేటి యువత దేశ ప్రగతికి ఉపయోగపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కార్యదర్శి ఎం. ప్రేమానందం, అబ్దుల్ కలాం సేవాదళ్ అధ్యక్షులు మొహమ్మద్ బాబ్జి. సిపిఐ కార్యదర్శి పి. రాము, కార్యకర్తలు కే. చంద్రరావు, మహమ్మద్ బాబ్జి, ఆర్. గోవిందు, ఎం.సత్యభద్రరాజు, ఎ. అప్పారావు, ఎం. గోపి, నారాయణ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాలపురంలో : భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి సునీల్, ఏరియా కార్యదర్శి ఆచంట సత్యనారాయణ కోరారు. గురువారం గోపాలపురంలోని భగత్ సింగ్, రాజు గురు సుఖదేవ్ ల 92 వర్ధంతి సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతలపూడి సునీల్ సిపిఐ ఏరియా కార్యదర్శి అచంట సత్యనారాయణ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతలపూడి సునీల్ సిపిఐ ఏరియా కార్యదర్శి ఆచంట సత్యనారాయణ మాట్లాడుతూ భారత మాత దాస్య శృంఖలాలను తెంపడానికి నిండు జీవితాన్ని ఉరికొయ్యలకు అంకితం చేసిన అమరవీరుడు సర్దార్ భగత్ సింగ్ అన్నారు.భగత్ సింగ్ పోరాట పటిమ ప్రతి విద్యార్థిలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కే. సంతోష్ ,సిహెచ్ సురేష్, కె. శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజోలులో : ప్రముఖ విప్లవకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవుల వర్ధంతి సభ గురువారం మలికిపురం మండలం దిండి గ్రామంలో సిపిఐ నాయకులు ఘనంగా నిర్వహించారు. తొలిత భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాజోలు ఏరియా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ప్రముఖ సినీ మాటల రచయిత బుర్ర సాయి మాధవ్ (బాహుబలి,ఆర్ఆర్ఆర్), అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర నాయకులు చెరుకుమిల్లి సింగ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జర్నలిస్టుల యూనియన్ (ఎపిఆర్‌జెయు) వ్యవస్థాపక అధ్యక్షులు ముచ్చర్ల రవి ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ పోరాడిన ఘట్టాలను వివరించారు. మతోన్మాద మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం యువత పై వుందని అన్నారు. ఈ కార్యక్రమంలో దిండి సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, దేవ సురేష్ బాబు, గొల్ల రమేష్, మేడిచర్ల సత్యనారాయణ, తాడి సురేష్ బాబు, పుల్లెల ఆనంద్, చింతా సుబ్బారావు, దేవ శ్యాంబాబు, ఇంజేటి శ్యాంబాబు, బందెల జయరాజు, బందెల వెంకటరావు, బత్తుల రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అరబిందో సహకారంతో పాఠశాలకు కొత్త హంగులు

విశాలాంధ్ర - కాకినాడ : రూ.60 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడ నిర్మాణానికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారిచే భూమిపూజ చేశారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవి నగరం గ్రామంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారిచే రూ.60 లక్షల వ్యయంతో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనంగా మూడు నూతన తరగతి గదులు, పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం పనులను గురువారం కొయ్య మురళి, మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్, ఇతర గ్రామ పెద్దల సమక్షంలో భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొయ్య మురళి మాట్లాడుతూ గ్రామంలో ప్రాథమిక పాఠశాల నుంచి 3,4,5 తరగతులను జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలపడం ద్వారా ప్రస్తుతం ఉన్న పాఠశాలలో సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపిస్తూ గ్రామ ప్రజల కోరిక మేరకు తమ పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ అరబిందో ఫార్మా ఫౌండేషన్ ముందుకు వచ్చి అదనంగా నూతన గదులు మరియు పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం పనులు ప్రారంభించినందుకు ఆరోబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్, ఆరోబిందో ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానందరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిదులు, గ్రామ పెద్దలు, పాఠశాల మోనిటరింగ్ కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

నూకాలమ్మ, పెద్దింట్లమ్మ జాతరలో రెండు వర్గాల మధ్య ఘర్షణ - ఒక వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కాకినాడ, తొండంగి : తొండంగి మండలం శృంగవృక్షం గ్రామంలో నూకాలమ్మ, పెద్దింట్లమ్మ జాతర జరిగింది. ఈ జాతరలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో తీవ్రంగా గాయపడిన తొండంగి గ్రామానికి చెందిన నడిపల్లి రాము(22) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం శృంగవృక్షం గ్రామంలో రెండురోజులుగా నూకాలమ్మ, పెద్దింట్లమ్మ జాతర జరుగుతోంది. తొండంగికి చెందిన యువకుడు నడిపల్లి రాము అమ్మమ్మ ఇంటికి శృంగవృక్షం వచ్చాడు. గ్రామంలో జాతర జరుగుతోందని జారతకు వెళ్ళాడు. జాతరలో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరగడంతో ఈ దాడిలో నడింపల్లి రాముతో పాటు నక్కా నాగేశ్వరరావు, నక్కా ఇస్సాకు, పులుగు గంగ బాబు, సింద్ధాంతపు రవి, దడాల పెద అప్పల కొండ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వైద్యం కోసం తొండంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కొరకు తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే రాము మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మిగిలిన వారంతా తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌పి రవీంద్రనాథ్ బాబు ఆదేశాల మేరకు శృంగవృక్షంలో పోలీస్ పికిట్ ఏర్పాటు చేశారు. మృతుడి తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 13మందిపై కేసు నమోదు చేశామని తొండంగి ఎస్సై, ఎస్. రవికుమార్ తెలిపారు.



వర్జీనియా పొగాకు రైతుల్ని ఆదుకుంటాం

ఎంపీ మార్గాని భరత్ రామ్

విశాలాంధ్ర - గోపాలపురం : అంతర్జాతీయ మార్కెట్లో అత్యంత డిమాండ్ గల ఎన్ ఎల్ ఎస్ పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎంపీ మార్గాన్ని భరత్ రామ్ కొనుగోలుదారులకు సూచించారు. గురువారం గోపాలపురం వర్జీనీయ పొగాకు వేలంకేంద్రం నందు పొగాకు కొనుగోళ్లను ఎంపీ భరత్ రామ్ పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ జి ఎల్ కె ప్రసాద్ అధ్యక్షతన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ మన ప్రాంతంలో పండించే ఎంఎల్ఎస్ పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయాల మేరకు పొగాకు ఉత్పత్తులను దశలవారీగా తగ్గించే క్రమంలో భారతదేశం కూడా కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. కర్ణాటక రాష్ట్రంతో పాటు ఆంధ్రాలో ఈ ఏడాది సరాసరి 210 రూపాయలు లభించినప్పటికీ పొగాకు రైతులు అకాల వర్షాల వల్ల మాను తెగులు, ఏరుకుళ్ళు వల్ల పంటలు పండిపోయి దిగుబడి పడిపోయిందని గిట్టుబాటు ధర కల్పించాలని, విద్యుత్తు పై రాయితీ కల్పించి తమను ఆదుకోవాలని ఎంపీని కోరారు. ఈ కార్యక్రమంలో వేలంకేంద్ర నిర్వహణ అధికారి ఎం. ఆదిశేషయ్య, ఐటిసి జనరల్ మేనేజర్ కళ్యాణ్ రామ్ రెడ్డి, పోలిశెట్టి కంపెనీ లీఫ్ మేనేజర్ జె. రఘు, జిపిఐ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, అలయన్స్, డెక్కన్, ముస్తఫా కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కరప స్టేషన్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - కరప : జిల్లా ఎస్పీ రవీంద్రబాబు గురువారం కరప పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కరప ఎస్సై ఎస్.రామకృష్ణ స్టేషన్ రికార్డులను అందజేసి ఎస్పీ రవీంద్ర బాబుకు కేసులు పై వివరణ ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ కరప మండలంలో అసాంఘిక కార్యకలా పాలు జరగకుండా పోలీసింగ్ ఎలా చేయా లనే దానిపై కరప స్టేషన్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎప్పటికప్పుడు డ్యూటీ రోస్టర్, అటెండెన్స్, సక్రమంగా నమోదు చేయాలని, స్టేషన్కు వచ్చే ప్రజల పట్ల, ఫిర్యాదు దారులు పట్ల ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అవలంబించాలని ఎస్ఐ రామకృష్ణకు తెలిపారు. తనిఖీలలో ఎటువంటి రిమార్కులు లేకపోవ డంతో ఎస్ఐ రామకృష్ణను అభినందించారు.

ప్రకటన

నా క్లయింటు అయిన ది ఆల్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్, రాజమండ్రి వారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారము యావన్మందికి తెలియజేయునది ఏమనగా, రాజానగరం మండలం, [illegible] గ్రామము డోరు నెం. 5-685 కాపురస్తులు బొంతు ప్రసాద్ గారి భార్య బొంతు శ్యామల గారు నా క్లయింటు బ్యాంక్ వద్దకు వచ్చి తన ఆస్తి అయిన [illegible] గ్రామము తాలూకు R.S. No. 508/1 [illegible] 11-11 [illegible] ... [illegible] ... డాక్యుమెంట్ నెం. 8611/1985 ... డాక్యుమెంట్ నెం. 1776/1997 ... డాక్యుమెంట్ నెం. 3565/2001 ... [illegible]

పి.సూర్యనారాయణమూర్తి
అడ్వకేట్, బ్యాంకు తరపు లాయరు
రాజమండ్రి, సెల్: 9885665808

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంపై ప్రత్యేక దృష్టి

-అధికారులతో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు పూర్తి స్థాయిలో అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని, సుస్థిర అభి వృద్ధి లక్ష్యాల సాధనకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి గురువారం సాయంత్రం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా క్యాంపు కార్యాలయం నుంచి హాజరయ్యారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, వైద్య ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమంబీ పాఠశాల విద్యా శాఖకు సంబంధించిన డ్రాప్ అవుట్స్, జగనన్న గోరు ముద్ద, మన బడి నాడు-నేడు, గ్రామ/వార్డు సచివాలయాల్లో స్పందన, గడప గడపకు మన ప్రభుత్వం అర్జీల పరిష్కారం, ఇతర ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై సీఎస్ జవహర్ రెడ్డి..కలెక్టర్లతో సమీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టరు కృతికా శుక్లా అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని, ఎస్డీజీ ప్రాధాన్య అంశాలపై వివిధ శాఖల అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. బడి బయట, డ్రాప్ ఔట్ పిల్లలను గ్రామ, వార్డు స్థాయిలో గుర్తించి వారిని రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించి వారిని వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో కె శ్రీధర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, డీఎం అండ్ హెచ్వో డా ఆర్ రమేష్, డీసీహెచ్ఎస్ డా పీబీ విష్ణువర్థిని, ఐసీడీఎస్ పీడీ కె. ప్రవీణ, డీఐఓ డాక్టర్ ఐ. ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు తదితరులు హాజరయ్యారు.

డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకస్మిక మృతి

విశాలాంధ్ర - కాట్రేనికొన : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ ఆకాశం శ్రీరామచంద్రమూర్తి (కన్నబాబు) (71) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ముమ్మిడివరం టిటిఆర్ నగర్‌లోని ఆయన స్వగృహంలో శ్రీరామచంద్రమూర్తి బుధవారం ఉదయం మాట్లాడుతూ గుండెపోటు గురై పడిపోవటంతో ఆయనను అమలాపురం ఆసుపత్రికి తీసుకు వెళ్లగా, మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారు. శ్రీరామచంద్రమూర్తికి భార్య కనకదుర్గ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాట్రేనికోన మండల పరిధిలోని కందికుప్పకు చెందిన మాజీ సమితి అధ్యక్షులు ఆకాశం చిట్టిబాబు ప్రథమ కుమారుడు శ్రీరామ చంద్రమూర్తి. ఆయన 1987లో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా పనిచేశారు. కొంత కాలం పాటు టిడిపిలో క్రియాశీలక పాత్ర పోషించి, ఆ తర్వాత 2017 వైసీపీలో చేరారు. ప్రస్తుతం ముమ్మిడివరం బాలయోగి తపో ఆశ్రమ కమిటీ ఉపాధ్యక్షులుగా, గతంలో కందికుప్ప సొసైటీ అధ్యక్షుడుగా, అమలాపురం టౌన్ బ్యాంకు పాలక వర్గ సభ్యులుగా పనిచేశారు. ఆయన భౌతికకాయాన్ని అమలాపురం కిమ్స్ ఆస్పత్రి నుండి స్వగ్రామమైన కందికుప్పకు తరలించారు. ఆయన మరణ వార్త విన్న పలువురు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి సంతాపం తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్ మృతి

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన మండల పరిధిలోని తీర ప్రాంతమైన పల్లం అంగన్ వాడీ టీచర్ గెద్దం అనంత లక్ష్మి (47) గురువారం మృతి చెందారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ స్వగృహంలో కన్నుమూశారు స్వగ్రామమైన డ్యామ్ సెంటర్ లోను, అంగన్ వాడీ సెంటర్, పల్లంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆమెకి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అంగన్ వాడి టీచర్ అనంత లక్ష్మి మృతి చెందటంతో పల్లం సర్పంచ్ మల్లాడి వీర బాబ్జి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రమణి, తులసి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

డబుల్ ఆర్ మూవీ నిర్మాత బుజ్జికి ఘన సన్మానం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు/శంఖవరం : కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన డబల్ ఆర్ మూవీ విజయం సాధించిన సందర్భంగా డబుల్ ఆర్ మూవీ నిర్మాత కోటిపల్లి బుజ్జిని కత్తిపూడి లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. డబుల్ ఆర్ మూవీ చిత్రం నిర్మతగా కోటిపల్లి బుజ్జి, దర్శకుడుగా వివిఎస్ఎస్‌వి మణికంఠ మూవీ నిర్మించారు. నటుడుగా మొగలి రాజా దివ్య రాజ్ నటించారని అన్నారు. ఈ సందర్భంగా నిర్మాత బుజ్జి మాట్లాడుతూ లారీ డ్రైవర్‌లు కోసం చాలా చక్కగా వివరించారు. అనంతరం లారీ ఓనర్స్ అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గౌతు అర్జీ బాబు, గౌరాధ్యక్షులు సాధనాల వీరబ్బాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి సత్తిబాబు, సెక్రెటరీ గాబు ఈశ్వరరావు, వెలగ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా రక్తదానమే మిన్న

విశాలాంధ్ర - అంబాజీపేట : అన్ని దానాలు కన్నా రక్తదానమే ఎంతో మిన్న అంటున్నారు ఆయుర్వేదం, ఫిజియో థెరపీ, డాక్టర్ జిమ్ యోగా శ్రీనివాస్. మానవసేవే మాధవసేవ, ఆ మాధవ సేవ ఆపదలో ఉన్న వారికి చేస్తే, పేద ప్రజల సేవ ఆ సేవే లక్ష్యంగా వెళుతున్నారు శ్రీ స్వామి వివేకానంద యోగా ఆశ్రమం, ఆయుర్వేదం ఫిజియోథెరపీ హాస్పిటల్ నిర్వాహకులు ఆకుల శ్రీనివాస్. గురువారం అంబాజీపేట మెంబర్స్ అమలాపురం ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఎస్‌కె అమ్మాజీ గర్భిణీ అల్లవరం, వో కామేశ్వరి రక్త హీనత, ఎరుకులంక, ఎం సుబ్బయ్యమ్మ, భీమనపల్లి, బి వెంకటలక్ష్మి మొగలమూరు. తోటకూర పార్వతి, గర్భిణీ స్త్రీ ఓడలరేవు, మెండి కుసుల తేజ్ బ్లడ్ తక్కువయిన వారికి మీసాల సతీష్, సురవరపు భాస్కర్, ఎన్ ప్రవీణ్, ఎం. దుర్గారావు, పి అనిల్, ఎం సుధాకర్, ఎన్ ప్రసాద్, పి బాలు రక్తదానం చేశారు.



యునైటెడ్ కింగ్డమ్ రిజిస్టర్ ఫిజియోథెరపిస్ట్‌గా మోహిత్‌కు గుర్తింపు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలికి చెందిన ఫిజియోథెరపీ డాక్టర్ మోహిత్ కృష్ణ లండన్‌కు చెందిన హెల్త్ అండ్ కేర్ ప్రొఫెషన్ కౌన్సిల్ (హెచ్‌సిపిసి) నుండి రిజిస్టర్ ఫిజియోథెరపిస్ట్‌గా గుర్తింపు ధృవీకరణ పత్రం అందుకున్నట్లు మోహిత్ తండ్రి శ్యామ్ స్థానిక మ్యాజిక్ హౌస్ విలేఖర్లకు తెలిపారు. ఈ గుర్తింపు ద్వారా మోహిత్ యునైటెడ్ కింగ్డమ్‌లోని అన్ని దేశాలలోను ఫిజియథెరపిస్ట్‌గా సేవలు అందించే అవకాశం వచ్చిందని హెచ్‌సిపిసి గుర్తింపు లేక పోతే అక్కడ ఫిజియథెరపీ సేవలు చేయడానికి వీలు లేదని యుకె ప్రభుత్వం అక్కడ వుండటానికి కూడా మూడు సంవత్సరాలు గుర్తింపు కార్డును కూడా జారీ చేసిందని శ్యామ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో సామాన్య విద్యను అభ్యసించి నేడు ప్రపంచవ్యాప్తంగా తన సేవలను అందించే స్థాయికి ఎదిగిన మోహిత్ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఎస్ఆర్‌కేఆర్‌లో 25 నుండి సంకేత జాతీయస్థాయి విద్యార్థి సింపోజియం

విశాలాంధ్ర-భీమవరం: ఈ నెల 25 ,26వ తేదీల్లో ఎస్ ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సంకేత పేరిట జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతి రాజు అన్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్స్ ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ ఆర్ కె నిశాంత్ వర్మ గురువారం కళాశాలలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో విడుదల చేశారు. కార్యక్రమంలో మెకానికల్ హెడ్ డాక్టర్ కె.బ్రహ్మ రాజు, డాక్టర్ సిహెచ్ రామభద్రిరాజు, విద్యార్థి ప్రతినిధులు త్రివేది, మేఘన, వర్క్ షాప్ ప్రతినిధులుగా దొమ్మేటి తేజ ,హర్టిక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో క్రమశిక్షణ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : దైనందిన జీవితంలో క్రమశిక్షణకు ఆధ్యాత్మికత ఎంతో దోహదపడుతుందని పలువురు పేర్కొన్నారు. శోభకృత్ నామ ఉగాది పర్వదిన సందర్భంగా ఏ వి ఆర్ ఎం స్కూల్ వద్ద గల షిరిడి సాయి మందిరంలో ఆధ్యాత్మిక కళాకారులకు అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు. బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ప్రైవేట్ పాఠశాలల డివిజన్ అధ్యక్షుడు ఐ. రాజ్ కుమార్, అపోలో, వి.ఎస్.ఎన్.కళాశాలల ప్రిన్సిపాల్స్ శ్రీవిద్య, స్వామి, సత్య సాయి సేవ సమితి సభ్యులు సత్యనారాయణ, షిరిడి సాయి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు చింత శ్రీదేవి, ఏవి సీతారామరాజు, జానకి రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి

విశాలాంధ్ర-ఏలూరు :పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపికి పట్టం కట్టడం ద్వారా ప్రజలు తమ అభిమతాన్ని తేటతెల్లం చేశారని, ఇదే కఠోర దీక్షా సంకల్పంతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూడా టిడిపి విజయానికి ప్రతి ఒక్కరు సైనికుల్లా పోరాడాలని టిడిపి ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి బడేటి చంటి పిలుపునిచ్చారు. ఏలూరు పవర్ పేట లోని టిడిపి కార్యాలయంలో ఉగాది సంబరాలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో జయ కేతనం ఎగురవేసినందుకు విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో పార్టీ కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ సైకో పోవాలి సైకిల్ రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారనడానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించడమే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాలి ప్రసాద్, ఉప్పాల జగదీష్ బాబు,చోడే వెంకటరత్నం,దాసరి ఆంజనేయులు, పెద్ది బోయిన శివప్రసాద్,నేరుసు గంగరాజు దాకారపు రాజేశ్వరరావు, బెల్లంకొండ కిషోర్ , టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల కరపత్రం ఆవిష్కరణ

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ఈనెల 30వ తేదీన భీమవరం టౌన్ హాల్లో పశ్చిమగోదావరి జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్, శ్రీవిజ్ఞానవేదిక అధ్వ ర్యంలో కీ.శే. ఎన్ వి ఆర్ దాస్ మెమోరియల్ రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్, మెన్స్ ఫిజిక్ చాంపియన్ షిప్, మిస్టర్ ఆంధ్ర ఛాంపియన్ షిప్ పోటీల బ్రోచర్స్‌ను గురువారం జిల్ల అడిషనల్ ఎస్పీ ఎవి సుబ్బరాజు ఆవిష్కరించి మాట్లాడారు. యువకులంతా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఇటువంటి ఆరోగ్యకరమైన కార్యక్రమాల్లో పాల్గొని తమ జీవితాలకు బంగారు బాట వేసుకోవాలన్నారు. నిర్వాహకులు బిక్కిన శ్రీనివాస్, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 30న సాయంత్రం 6 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, 11 విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి విభాగంలోనూ 6 బహుమతులను అందిస్తున్నామని, చాంపియన్ ఆఫ్ ఛాంపియన్స్, మోస్ట్ మస్కులర్ మెన్, బెస్ట్ పోస్టర్ వంటి నగదు అవార్డులను కూడా అందిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది బిల్డర్స్ ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాకేష్, జి. పవన్, మహేష్, ఎం.అజయ్, ఎస్ కే బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ వారసత్వాన్ని యువత అందిపుచ్చుకోవాలి

విశాలాంధ్ర-ఏలూరు: ఉమ్మడి గోదావరి జిల్లా పి డి ఎస్ యు కమిటీల ఆధ్వర్యంలో భగత్ సింగ్ 92వ వర్ధంతి సభ కొత్త బస్టాండ్ ప్రక్కన గల అల్లూరు సత్యనారాయణ భవనంలో పిడిఎస్‌ఓ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.మోహన్ అధ్యక్షతన జరిగింది.
ఈ సభకు ముఖ్య అతిథిగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ నాణ్యతతో కూడిన చదువులు ప్రజలందరికీ అందుబాటులో లేని కారణంగా పేద ప్రజలు వారి విద్యకు దూరమవుతున్నారని అన్నారు. మాతృభాషా మాధ్యమంలో చదువులు సాగినపుడు మాత్రమే దేశాభివృద్ధి సాగుతుందన్నారు.విద్యారంగంలో సమస్యల పరిష్కారం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ చదువుల పేరుతో పాఠశాల, కళాశాల యాజమాన్యాలు పెట్టే ఒత్తిడికి తట్టుకోలేక ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. పాఠశాల విద్యార్థులు మొదలుకొని మెడిసిన్,ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా చనిపోతున్నారన్నారు. నవ యువ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కె.భాషా గారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటు,కార్పోరేట్ శక్తులకు అప్పగిస్తూ నిరుద్యోగ సైన్యాన్ని పెంచి పోషిస్తున్నారనీ, మరోవైపు కుల,మత ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతూ విద్యార్థి, యువతను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఉమ్మడి ప.గో. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 150 మంది విద్యార్థులు, యువకులు సభలో పాల్గొన్నారు.సభకు ముందు వసంత మహల్ నుండి జూట్ మిల్లు,ఫైర్ స్టేషన్ మీదుగా కొత్త బస్టాండ్ వరకు భగత్ సింగ్ కు జోహార్లు చెపుతూ ర్యాలీ,ప్రదర్శన నిర్వహించారు.

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్

విశాలాంధ్ర - గణపవరం: భారత దేశ స్వాతంత్రం కోసం 23 సంవత్సరాలు చిన్న వయసులో ఉరి కంభం ఎక్కి ప్రాణాలు అర్పించిన అమరవీరుడు భగత్ సింగ్ అని గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి అన్నారు. గురువారం కళాశాల చరిత్ర శాఖ తరపున షాహిద్ సర్దార్ భగత్ సింగ్ 92 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల చరిత్ర శాఖ అధ్యాపకులు డివివి చిన సత్యనారాయణ మాట్లాడుతూ విప్లవం వర్ధిల్లాలి అని నినాదాలతో ప్రాణాలు అర్పించిన షాహిద్ సర్దార్ భగత్ సింగ్ గొప్ప వ్యక్తి అని ఆయన కొనియాడారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రశంసా పత్రంతో పాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. మధురాజు, డాక్టర్ టి. అక్కిరాజు, డాక్టర్ కె స్వరూపరాణి, డాక్టర్ జి వెంకటరావు, బి. రమేష్ కుమార్,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర-టి.నరసాపురం : టి నరసాపురం పంచాయతీలోని అల్లూరి సీతారామరాజు నగర్ లో ప్రత్యేక గ్రామ పంచాయితీ పోరాటసమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ 49వ వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఎర్ర కాలువ వెలుపలి గ్రామాలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం లో భూక్యా వేణు, అనుమోలు మురళీ కృష్ణ, కుంజా కిరణ్, మడకం సుబ్బాయమ్మ, షేక్ అమీనా, మడకం కుమారి, వగ్గాల లక్ష్మి, పెట్ల మంగ, తాటి బూషమ్మ, పండు వీరబాద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మరుగునపడుతున్న ప్రాచీన కళలు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట పరిసర ప్రాంతాల్లో ఎన్నో కళలకు సంబంధించి ప్రసిద్ధకళాకారులు ఉన్నప్పటికీ వారి కళలను చూపించేందుకు సరైన అవకాశాలు లేకపోవడంతో ప్రాచీన కళలన్నీ మరుగున పడిపోతున్నాయని, వాటిని బ్రతికించేందుకు సామర్లకోటలో సకల కళా సమాఖ్యకు ఒక ఆడిటోరియం నిర్మాణానికి కృషి చేయనున్నట్టు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్ఆర్సిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి దవులూరు దొరబాబు అన్నారు. సకలకళా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉగాది కళోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమాఖ్య గౌరవ అధ్యక్షులు దవులూరి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు విచ్చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామర్లకోట కలలకు పెట్టింది పేరుగా పూర్వం నుంచి వస్తుందన్నారు. సామర్లకోట, కాకినాడ ప్రాంతాల నుంచి పాడుతా తీయగా, సరిగమ ప వంటి కార్యక్రమాల్లో పాల్గొని కొందరు సినీ రంగంలో రాణిస్తున్న సందర్భాన్ని ఆయన గుర్తు చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, వైస్ చైర్మన్లు ఊబా జాన్ మోజెస్, గోకిన సునేత్రాదేవి లు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అనంతరం పలువురు సీనియర్ కళాకారులను ప్రముఖ వీరభద్ర జ్యోతిష్యాలయం నిర్వాహకులు చీమల కొండ వీరభద్ర ప్రసాద్, ముఖ్య అతిథులు దొరబాబు, సుబ్బారావు, చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌లతో పాటు లైన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తూరు వీర్రాజు (రాజా), జిల్లా సెకండ్ వైస్ గవర్నర్ ఈదల ఈశ్వర కుమార్, స్థానిక లైన్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్ సుధారాణి, తదితరుల చేతుల మీదుగా పూలమాలలు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య గౌరవ సలహాదారులు, సినీ దర్శకులు కేబీ ఆనంద్, న్యాయ సలహాదారులు కొర్లమండ వీరభద్రరావు, అధ్యక్షులు బదుగు సీతారామరాజు (బాబి), కార్యదర్శి సేపేని సురేష్, కోశాధికారి అలమంద ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విజ్ఞానంతో నూతన ఆవిష్కరణలు సాధించాలి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని నూతన ఆవిష్కరణలవైపు అడుగులు వేయాలని ఆంధ్రప్రదేశ్ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి అన్నారు. గురువారం పెదతాడేపల్లి వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న టెక్ యుఫోరియా 2కె23 సాంకేతిక ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మక శక్తిని బయటకి తీసేందుకు సాంకేతిక విజ్ఞాన కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకుని సాంకేతికత పరిజ్ఞానం సద్వినియోగం చేసుకుని కాలానుగుణంగా ఉపయోగపడే నూతన అవిష్కరణలు సాధించాలని అన్నారు. కృషి పట్టుదలతో నూతన ఆవిష్కరణలు సాధించడానికి ప్రయత్నిస్తే తప్పనిసరిగా ఫలితం లభిస్తుందన్నారు. విద్యార్థి స్థాయి నుంచే సృజనాత్మకత కలిగి ఉండాలని అన్నారు. కళాశాల ద్వారా అందిస్తున్న విద్యా వనరులను సద్వినియోగం చేసుకుని ప్రతీ విద్యార్థి సాంకేతిక, క్రీడా రంగాల్లో రాణించాలని కోరారు. సాంకేతిక విజ్ఞాన కార్యక్రమాల్లో ఉమ్మడి జిల్లాలోని సుమారు 25 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, టెక్నికల్ డైరెక్టర్ సి. హెచ్. అప్పారావు, టెక్ యుఫోరియా కో ఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు, నిట డీన్ జయరామ్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశాజనకంగా వర్జీనియా పొగాకు ధరలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలోని 1 , 2 పొగాకు వేలం కేంద్రాలలో గురువారం ఉదయం పొగాకు కొనుగోలు ప్రారంభమైంది. రెండు వేలం కేంద్రాల అధికారులు పూజలు నిర్వహించి, వేలాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 1,2వేలం కేంద్రాల నిర్వహణ అధికారులు జే.సురేంద్ర కుమార్,వి.శ్రీహరి మీడియా తో మాట్లాడుతూ మొదటి వేలం కేంద్రానికి 27 పొగాకు బేళ్లు,రెండవ వేలం కేంద్రంలో 99 బేళ్లు వేలానికి వచ్చాయన్నారు.మొత్తం 7 కంపెనీల ప్రతినిధులు మొదటి రోజు వేలంలో పాల్గొన్నారని తెలిపారు.ప్రారంభ రోజు ధర రూ.210 వచ్చిందని ఈ ధర పెరిగే అవకాశం ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పొగాకు పంట వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.ఈ సందర్భంగా పొగాకు రైతు నాయకులు పరిమి రాంబాబు మాట్లాడుతూ గురువారం ప్రారంభమైన పొగాకు వేలం ద్వారా రైతులకు కంపెనీల వద్ద నుండి రూ. 230లు ఆశించామని, మొదటి రోజు రూ.210ల ధర పలకడంతో రైతులు నిరాశ చెందారన్నారు. కౌలు రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదన్నారు. ఈ వేలంలో పొగాకు రైతు సంఘం నాయకులు కరాటం రెడ్డి బాబు , వామిశెట్టి హరిబాబు ,పొగాకు రైతులు,వేలం కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయాలలో హుండీ ఆదాయం లెక్కింపు

విశాలాంధ్ర -కైకలూరు : స్థానిక కైకలూరు పట్టణం లో వేంచేసి ఉన్న శ్రీ శ్యామలాంబ అమ్మవారి ఆలయ క్షేత్రంలో శ్రీ శ్యామలాంబ దేవస్థానం హుండీలను ఈరోజు శ్రీయుత తనిఖీ అధికారి దేవాదాయ ధర్మాదాయ శాఖ గుడివాడ వారి పర్యవేక్షణలో మరియు ధర్మకర్తల మండలి సమక్షమున తెరిచే లెక్కించగా మూడు నెలల 20 రోజులకు గాను 2,28,767 రూపాయలు వచ్చింది. హుండీ లెక్కింపు సందర్భంగా భక్తులు ధర్మకర్తల మండలి చైర్మన్ గుర్రం రాంబాబు అర్చకులు సిబ్బంది ఈ హుండీ లెక్కింపులో పాల్గొని ఉన్నారు అలాగునే శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కించగా మూడు నెలల 20 రోజులకు 27,245గా వచ్చి ఉన్నది అలానే స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ తెరిచి లెక్కించగా మూడు నెలల 20 రోజులకు గాను 1,31,986 రూపాయలు హుండీ ఆదాయం వచ్చిందని ఒక ప్రకటనలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వి ఎన్ కే.శేఖర్ తెలిపారు.

గవరపేటలో సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ట



విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు మండలం గవరపేట గ్రామంలో గురువారం సీతా రామలక్ష్మణ సమేత హనుమాన్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజల సహకారంతో ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో హెూమం నిర్వహించారు. హెూమం లో గ్రామ సర్పంచ్ పొలిమేర వెంకటేశ్వరరావు దంపతులతో పాటు పలువురు దంపతులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం అంతా వేదమంత్రోచ్చారణతో మార్మోగింది. శుక్రవారం విగ్రహాలను ప్రతిష్టించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహిళల జీవన విధానం ఆదర్శంగా ఉండాలి

విశాలాంధ్ర - లింగపాలెం : గ్రామీణ ప్రాంతాలలో ఉండే మహిళల జీవన శైలి ఆదర్శంగా ఉండాలని, దీనికోసం వారు తమ ప్రతిభను పెంపొందించు కోవాలని హోలీ ఫ్యామిలీ సిస్టర్స్ అసోసియేషన్ జాతీయ స్థాయి అధ్యక్షురాలు సిస్టర్ మేరీ అన్నారు. ములగలంపాడులో మహిళా సాధికారిత కార్యక్రమంలో ఈమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులైన మహిళలు గ్రామాలలో ఉన్నారని, వీరి ప్రతిభ వెలుగులోకి రావాలని, అటువంటప్పుడు సమాజం అభివృద్ధి చెందు తుందని అన్నారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలపడేందుకు మహిళలు ముందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇనుగంటి రాజేష్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సందీప్, ఫాదర్ జీవరత్నం, మేరీ మెట్టల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోలీ ఫ్యామిలీ సంస్థ తరపున 15 మందికి ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.

ఘనంగా ప్రారంభమైన శ్రీ కొండలమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం ప్రధాన రహదారి చెంతన వేంచేసి ఉన్న శ్రీ కొండలమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ అర్చకులు నాగరాజు శర్మ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ వరకు జరుగును అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి, మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. ఆలయం వద్ద ప్రతి రోజు ఉచిత ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

చేపల పెంపక ప్రోత్సాహమే ప్రధాన లక్ష్యం

విశాలాంధ్ర - అనపర్తి : దేశంలో చేపల పెంపకాన్ని ప్రోత్సహించడమే పిఎం మత్స్య సంపద యోజన పథకం ప్రధాన లక్ష్యం అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం ఫోర్ వీలర్ లైవ్ ఫిష్ ట్రాన్స్పోర్ట్ వెహికల్,10 ట్యాంకులు, ఆక్సిజన్ సిలిండర్స్ తో రూ.20 లక్షల విలువగల యూనిట్ ఎమ్మెల్యే ప్రారంభించారు. యూనిట్ ఏర్పాటుచేసిన సింగిడి గోవిందుని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫిషరీస్ అధికారి వి కృష్ణారావు, అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్ కె హరీష్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ ముని కాంత్ తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ నేటి యువతకు స్ఫూర్తి

విశాలాంధ్ర - సీతానగరం : పోరాట యోధుడు భగత్ సింగ్ నేటి యువతకు స్ఫూర్తి అని సిపిఐ ఎంఎల్ తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు అన్నారు. మండలంలో సీతానగరం బస్ స్టాండ్ సెంటర్లో పలివెల వీరబాబు అధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా, దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన వీరులు అన్నారు. ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గ సిపిఐ ఎంఎల్ పార్టీ ప్రెసిడెంట్ సిద్ది నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు నందమూరి చిట్టి స్వామి, సీతానగరం మండలం ప్రెసిడెంట్ తెలగరపు రమేష్, ఎస్ నాని, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల ప్రెసిడెంట్ రంగా శీను, జనసేన పార్టీ నాయకులు బండి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర - చాగల్లు : మండల కేంద్రం చాగల్లు పాటమ్మ అమ్మవారి పూరి గుడిసె వద్ద ఉగాది ముగింపు సందర్భంగా గురువారం భక్తుల ఆర్థిక సహకారంతో భారీ అన్న సమారాధన జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు లింగాల శ్రీనివాస శర్మ, కమిటీ సభ్యులు సుమారు 5000 మంది అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

దుర్గాడ శివాలయ గర్భాలయం తాకిన సూర్యకిరణాలు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలంలో ప్రసిద్ధిగాంచిన దుర్గాడ శివాలయంలో గురువారం శ్రీ ఉమా రామ లింగేశ్వరుని నేరుగా సూర్యకిరణాలు తాకాయి. ఈ నేపథ్యంలో భానుడి స్పర్శతో గర్భాలయం అంతా దేదీప్యమానంగా సూర్య కిరణ స్పర్శతో ప్రకాశించింది. మార్చి నెలలో, సెప్టెంబర్ నెలలో సంవత్సరానికి రెండు పర్యాయాలు సూర్యాస్తమయ అరుణ కిరణ స్పర్శ రామలింగేశ్వరుడి మీద పడతాయని ఇది రామలింగేశ్వరుని నిదర్శనమని ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు, సేవా సమితి వారు మీడియాకు తెలియజేశారు.

పోలవరం ప్రాజెక్టు ఉరి బిగించొద్దు

ఎఐఎకెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక కృష్ణమూర్తి

విశాలాంధ్ర -భీమవరం: శొంఠి రామ్మూర్తి కలల స్వప్నం పోలవరం ప్రాజెక్టు నేటికీ పూర్తి కాకపోవడం శోచనీయమని పాలకుల రాజకీయాలతో, చేతకాని పనులతో పోలవరానికి ఉరి బిగించొద్దని ఆల్ ఇండియా అగ్రగామి కిసాన్ సభ (ఎఐఎకెఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక కృష్ణమూర్తి పాలకులను హెచ్చరించారు. గురువారం భీమవరంలో జరిగిన ఎఐఎకెఎస్ రాష్ట్ర కార్యవర్గం సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును 170 మీటర్ల ఎత్తులో కడితేనే ప్రాజెక్టు లక్ష్యం నెరవేరుతుందని దాన్ని 140 మీటర్లు కడ్తామంటున్నారని చేతకాని పాలకులు డిజైన్లు మార్చేసి ఎత్తు తగ్గిస్తే డబ్బంతా వృదా అని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు 170 మీటర్లు ఉండాలని బచావత్ ట్రిబ్యునల్ ప్రకటించిందని లంక గుర్తు చేశారు. విభజన హామీల్లో కేంద్రమే పోలవరం పూర్తి చేయాలని స్పష్టం గా ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని పూర్తిగా నష్టపోతే ఎకరాకు లక్ష రూపాయలు, పాక్షికంగా దెబ్బ తింటే ఏభై వేలు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దండు శ్రీనివాసరాజు, కనుమూరి వెంకటపతిరాజు, పలు జిల్లాల నుంచి విచ్చేసిన రాష్ట్ర సమితి సభ్యులు బి.రామచంద్రరాజు, రాజునాయుడు, ప్రసాదరాజు, ఎ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - రాజానగరం : స్వాతంత్ర్యపోరాట సమయంలో తెల్లదొరలకు ఎదురొడ్డి, ప్రాణాలు సైతం లెక్కచేయకుండా తన దేశ భక్తిని చాటి చెప్పిన భగత్ సింగ్ వంటి మహనీయులను ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని అఖిల భారత రైతు కూలి సంఘం(ఏఐకేఎంఎస్) జిల్లా నాయకులు జన్నుపల్లి సత్తిబాబు అన్నారు.నౌజవాన్ భారత్ సభ వ్యవస్థాపకులు స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా ఉద్యమకారుడైన భగత్ సింగ్ సుఖదేవ్ రాజుగురు 92వ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని సూర్యారావుపేటలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. దీనిలో భాగంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు సంఘం డివిజన్ నాయకులు వరుకుర్తి వీరలక్ష్మి, తుమ్మల కళావతి, నక్క లక్ష్మి, గొన్నూరు లక్ష్మి, తోటకూర బేబీ, మార్గాని సత్యవతి, తామరల గౌరీ, నక్క సత్యవేణి, బిల్లకుర్తి జగదంబ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ రహిత సమాజం కోసం యువత పోరాడాలి

విశాలాంధ్ర - పెదపూడి : దేశంలోని యువత ముందుకొచ్చి భగత్ సింగ్ స్ఫూర్తితో అసమానతలకు వ్యతిరేకంగా దోపిడి రహిత సమాజంకోసం పోరాడాలని ఏపీఆర్సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్వూరి రాజబాబు పిలుపునిచ్చారు. పెదపూడిలోని కైకవోలు సెంటర్లో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం (ఏపీఆర్సీఎస్) డివిజన్ కమిటీ అధ్వర్యంలో షహీద్ భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్‌ల 92వ వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రాజబాబు, డివిజన్ ప్రధాన కార్యదర్శి మడికి సత్యం. జిల్లా నాయకుడు ఎల్లే. సత్తిబాబు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ భగత్ సింగ్ రాజగురు, సుఖ్ దేవ్‌లు బ్రిటీష్ సామ్రాజ్య దోపిడికి వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసి, ఉరికొయ్యలను ముద్దాడి ప్రాణాలను అర్పించిన మహనీయులు అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రగతి శీల మహిళా సంఘం(స్త్రీవిముక్తి) జిల్లా కన్వీనర్ వడ్లమూరి మంగాదేవి, డివిజన్ నాయకుడు స్వయంవరపు అప్పలస్వామి, వల్లూరి సత్తిబాబు, శ్రీను, నాని, తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

విశాలాంధ్ర - అమలాపురం : భారత దేశ స్వేచ్ఛ స్వతంత్రం కోసం తన సమాజం కోసం ఉద్యమించి ఆంగ్లేయుల దుర్మార్గపు పాలనలో నవ్వుతూ ఉరికంబాన్ని ఎక్కిన సాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లను స్ఫూర్తిగా తీసుకుని నేటి కాలంలో జరుగుతున్న అవినీతి అన్యాయాలకు, కుల మతోన్మాదాలకు వ్యతిరేకంగా విద్యార్థులు యువత ఉద్యమించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతి రావు పిలుపునిచ్చారు. భారత స్వతంత్ర ఉద్యమ విప్లవ వీరులు భగత్ సింగ్ రాజ్ గురు సుఖ దేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో క్యాండిల్ ప్రదర్శన జరిపి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షులు పొలమూరి మోహన్ బాబు, ప్రజా సంఘాల నాయకులు బొంతు రమణ, ఎం శ్రీను, శెట్టి బత్తుల తులసిరావు, ఉడుము కిషోర్, గంటి శ్రీకాంత్, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాస్టర్ పై అగ్రకులాల దాడి అమానుషం

విశాలాంధ్ర-ఉండి: దళిత కుటుంబ పాస్టర్ పై అగ్రకులాల దాడి అమానుషం అని ఎఫ్ ఎఫ్ సి ఐ నేషనల్ ప్రెసిడెంట్ పీటర్ పుట్ట, వెల్ఫేర్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్ అన్నారు. చెరుకువాడ గ్రామంలో చర్చి నిర్మాణం పై అగ్రకులస్తులు దాడి చేసి అడ్డుపడడంతో క్రిస్టియన్ ఫెడరేషన్ గురువారం ఉండి మండల తహసిల్దార్ కార్యాలయంలో, తహసిల్దార్ ఎం. రవీంద్ర కుమార్ కు, స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం పీటర్ పుట్ట, ఇస్మాయిల్ విలేకరులతో మాట్లాడుతూ ఉండి మండలం చెరుకువాడ గ్రామంలో సుమారు 20 సంవత్సరాల నుండి పాస్టర్ హేమ కుమార్ అతని కుటుంబం జీవనం కొనసాగిస్తూ చర్చిలో పాస్టర్ గా పనిచేస్తున్నారని తెలిపారు. ఆ చర్చి శిథిలావస్థకు చేరడంతో రెండు సంవత్సరాల క్రితం చర్చి నిర్మాణాన్ని ప్రారంభించారని కరోనా నేపథ్యంలో చర్చి నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. అనంతరం తిరిగి ఇటీవల కాలంలో చర్చి నిర్మాణ పనులు ప్రారంభించగా అక్కడ నివసిస్తున్న అగ్రకులాల వారు హేమకుమార్ కుటుంబం పై దాడికి విఫల యత్నం చేశారన్నారు. కొందరు యువకులు ఇంటి చుట్టూ ద్విచక్ర వాహనాలతో హారన్ లు వేసుకుంటూ, కేకలు వేస్తూ హేమకుమార్ కుటుంబాన్ని భయాందోళనలకు గురిచేస్తున్నారని అన్నారు. క్రైస్తవులు అగ్రకులాల మధ్య నివాసం ఉండకూడదని వివక్షత చూపిస్తూ వేధించడం మొదలు పెట్టారని ఇది ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. తహసిల్దార్ కు, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన వారిలో జిల్లా ప్రెసిడెంట్ స్టాన్లీ థామస్, పొలిటికల్ ప్రెసిడెంట్ రాజేష్ ఖన్నా, జిల్లా సెక్రటరీ యేవేలు రాజు, ఏఐసిఎఫ్ జిల్లా ప్రెసిడెంట్ రాజారావు, మత్తే రాజ్ కుమార్,ఉండి మండల పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు తదితరులు ఉన్నారు.

విశ్వాసం కోల్పోయిన జగన్

విశాలాంధ్ర-చాట్రాయి: ముఖ్యమంత్రి జగన్ క్షణక్షణం ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నారని టిడిపి ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో పంచుమర్తి అనురాధ టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగాపశుమర్తి అనురాధ విజయంసాదించారని తెలియడంతో మండల కేంద్రమైన చాట్రాయి సెంటర్లో టిడిపి శ్రేణులు టపాసులు పేల్చుతూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బసవ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ సొంత వాళ్ళ కోల్పోయారని తల్లి చెల్లి సొంత బాబాయ్ అందరినీ వాడుకుని వదిలేస్తుంటే సొంత పార్టీ ఎమ్మెల్యేలు పట్టబద్రులు అందరి విశ్వాసాన్ని కోల్పోయారన్నారు. ఏ క్షణంలో సాధారణ ఎన్నికలు జరిగినా జగన్ ఓటమి ఖాయం అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కంచర్ల హనుమంతరావు ,తోటకూర వెంకటేశ్వరరావు, ప్రభాకర్ రెడ్డి, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి

విశాలాంధ్ర-కాళ్ళ: సిపిఎం కాళ్ల గ్రామ శాఖ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి జరిగింది కాళ్ల బస్టాండ్ సెంటర్‌లో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ భగత్ సింగ్ బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలను తునప్రాయంగా అర్పించారని ఈరోజు యావత్తు ఇవతలు యువకులు భగత్ సింగ్ ఆశయాల కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు ఈరోజు భారతదేశ ప్రమాదంలో ఉందని దేశ సంపదను కేంద్ర ప్రభుత్వం ఒక్కరిద్దరికి దోశ పెడుతుందని విమర్శించారు దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజల మీద ఉందని యావత్ ప్రధానికం భగత్ సింగ్ ఆశయ సాధనలో భారతదేశాన్ని కాపాడుకునేందుకు ముందుకు రావాలని కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు మండా సూరిబాబు, తిరుమణి శ్రీను, పుట్టబోతుల మధు నిమ్మల అంజి ఇంకా తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల వర్ధంతి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయములో స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురుల వర్ధంతిని పురస్కరించుకొని వారికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అబివృద్ధి అధికారి, నాతి బుజ్జి మాట్లాడుతూ భరతమాతను దాస్యశృంఖలాల నుంచి విడిపించడానికి అసమాన పోరాటం చేసిన ఈ ముగ్గురు యోధులను నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఉరికంబం ఎక్కించిందని, చిన్న వయసులోనే వీరు ముగ్గురు వీరులు దేశం కోసం ప్రాణత్యాగం చేశారని మరియు దేశానికి స్వాతంత్రము తేవడానికి పోరాడి అమరులైన వారిలో భగత్ సింగ్, సుఖ్ దేవ్, మరియు రాజ్ గురులు ఎప్పటికీ ప్రత్యేకమే అని కొనియాడారు. ఈ కార్యక్రమములో వసంతవాడ సర్పంచ్ గాదిరాజు రామకృష్ణం రాజు, పరిపాలనాధికారి టివి సురేంద్ర రెడ్డి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది మరియు మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గోన్నారు.